సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 16 । మార్చి । 2025



మన్యంలో మృత్యు ఘోష

మన్యంలో పిల్లలు మరణిస్తున్నారని.. దీనిపై కారణాలు తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారని జెడ్పీటీసీలు అన్నారు. 8లో



ఘనంగా పుష్పయాగం

కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలు శని వారం రాత్రితో ఘనంగా ముగిశాయి. 8లో



ఇఫ్తార్	సహర్
ఆది	సోమ
6.08	4.52

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

మొదలైన న్యాయవాదుల నామినేషన్ పర్వం



నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఎన్నికల అధికారి, ప్రముఖ న్యాయవాది జీఎం రెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ల పర్వం మొదలైంది. శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పలువురు న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, గ్రంథాలయ కార్యదర్శి, సాంస్కృతి కార్యదర్శి, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యుల కోసం ఎన్నికలు జరుగుతాయి. 18వ తేదీ సాయంత్రం వరకు నామినేషన్ పర్వం కొనసాగుతుంది. 19న నామినేషన్ల పరిశీలన, 20 వరకు ఉపసంహరణ, అదే రోజు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 28వ తేదీ ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు రాత్రి ఫలితాలు వెల్లడిస్తారు.

పీ-4 సర్వేకు సూచనలివ్వండి

మహారాణిపేట: పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా జరుగుతున్న పీ-4 సర్వేకు క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను తెలియజేయవచ్చని కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ జిల్లా ప్రజలకు సూచించారు. ఈ నెల 8న ప్రారంభమైన పీ-4 సర్వే, 18వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ సర్వేకు క్యూఆర్ కోడ్ ద్వారా గానీ, https://swamandhra.ap. gov.in/p4 ద్వారా గానీ ప్రజలు వారి సూచనలు, సలహాలు తెలియజేయవచ్చన్నారు. ఇందుకు గానూ సీఎం నారా చంద్రబాబు సంతకంతో ప్రశంసాపత్రం అందిస్తామని ఓ ప్రకటనలో తెలిపారు.

సచివాలయాలకు 4,631 బయోమెట్రిక్ యంత్రాలు



బయోమెట్రిక్ యంత్రాలు అందజేస్తున్న కలెక్టర్

మహారాణిపేట: వివిధ రకాల సర్వేలు, సేవలు అందించేందుకు వీలుగా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలకు కొత్తగా 4,631 బయోమెట్రిక్ యంత్రాలు వచ్చినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. ఈ యంత్రాలను కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా శనివారం తీసుకున్నట్లు చెప్పారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం నిర్దేశించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్‌తో కలిసి శనివారం పలు ప్రాజెక్ట్‌లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చేపట్టనున్న రైల్వే, హెచ్‌పీసీఎల్, ఇరిగేషన్, విద్యుత్, ఐవోసీఎల్, జాతీయ రహదారులు, అంతర్గత రోడ్లు తదితర ప్రాజెక్ట్‌లకు నిర్ణీత కాలంలో అవసరమైన భూములను సేకరించి, నివేదిక అందేజేయాలని ఆదేశించారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

17 మంది పోలీస్ సిబ్బందికి స్థానచలనం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 17 మంది పోలీస్ సిబ్బందికి స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ ఏఎస్ఐ టి.శ్యాంప్రసాద్‌ను ఎంవీపీ లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. అలాగే ఎనిమిది మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగించారు.

కంచరపాలెం సీఐ బదిలీ

మద్రిపాలెం: కంచరపాలెం లా అండ్ ఆర్డర్ ఇన్‌చార్జి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న కె.రవికుమార్‌ను సీసీఎస్–4కు బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ని గతంలో విశాఖ రేంజ్ నుంచి వీఆర్‌కు అటాచ్ చేశారు. ఈ ఏడాది జనవరిలో వీఆర్ నుంచి కంచరపాలెం ఇన్‌చార్జి సీఐగా నియమించారు.



మాయా గోపాలం!

- ఇద్దరు కాంట్రాక్టర్లకు నామినేషన్ పనులు
- 'ప్రణ'మిల్లి పనులు అప్పగిస్తున్న ఓ ఇంజనీర్
- యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు కోసం అత్యుత్సాహం
- ఉన్నతాధికారి ద్వారా పనికానిచ్చేందుకు ఒత్తిళ్లు
- చినబాబుకు మంచిగా చెబుతానంటూ మస్కా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఒక వైపు ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగులకు, సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న కూటమి ప్రభుత్వం... మరోవైపు అక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహారాలు నడిపేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అర్హత లేని వ్యక్తికి యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు కట్టబెట్టేందుకు మాయా 'గోపాల' వ్యవహారం మొదలైంది. తాను చెప్పిన ఇద్దరు వ్యక్తులు చినబాబుకు దగ్గరని.. వారికి పనులు దక్కేలా చూడాలంటూ యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టును ఆశిస్తున్న ఇంజనీర్‌కి.. అర్హతకు మించి పోస్టు దక్కించుకున్న ఓ చోటా నేత ఆదేశాలు జారీచేసినట్టు తెలుస్తోంది. ఇందుకు జీ హుజూర్ అంటూ సదరు **ఇంజనీర్ కూడా 'ప్రణ'మిల్లి టెండర్లు పిలవకుండా నామినేషన్‌పై అప్పగిస్తున్నట్టు సమాచారం. మరోవైపు సదరు ఇంజనీర్‌కే యూనివర్సిటీ ఇంజనీర్ (యూఈ) పోస్టు దక్కేలా చూడాలంటూ యూనివర్సి**టీలోని ఓ అధికారికి కూడా సదరు చోటా నేత ఆదేశించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా తాను చినబాబుకు ఎంత దగ్గరో మీకు తెలుసంటూ... మీ గురించి మంచిగా చెబుతానంటూ వల వేసినట్టు ప్రచారం జరుగుతోంది. అనుకున్నట్టుగానే సదరు అధికారి కూడా ఫలానా వ్యక్తికే యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు ఇవ్వాలంటూ అనధికారికంగా ఆదేశాలు జారీచేసినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా రికార్డులను కూడా సెట్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటివరకు ఈ విధంగా రూ.50 లక్షల మేర పను**లను నామినేషన్‌పై సదరు చోటా నేత సూచించిన ఇద్దరు వ్యక్తులకే కేటాయించినట్టు తెలుస్తోంది. వీరి నుంచి తనకు రావాల్సిన 10 శాతం పర్సంటేజీని వసూలు చేసుకుంటున్నట్టు సమాచారం. మొత్తంగా** సదరు చోటా నేత యూనివర్సిటీలో బడా వ్యవహారాలు చక్కాగా నడుపుతున్నారు.

చినబాబుకు దగ్గరంటూ...!

వాస్తవానికి ఊహించని రీతిలో నామినేషన్ పదవిని దక్కించుకున్న సదరు చోటా నేత... తనకు చినబాబు దగ్గర కావడంతోనే పదవి వచ్చిందంటూ చెప్పుకుంటున్నారు. చినబాబు టూర్‌లోనూ హడావుడి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో సదరు నేత సిఫార్సు చేసిన ఇద్దరు కాంట్రాక్టర్లు కూడా చినబాబుకు దగ్గరంటూ యూనివర్సిటీ అధికారులకు చెబుతున్నారు. వారికి ఇప్పటికే నామినేషన్ పనులను అప్పగిస్తున్నారు. అంతేకాకుండా టెండర్ వ్యవహారాల్లో కూడా ఈ ఇద్దరు కాంట్రాక్టర్లకే దక్కేలా చక్రం తిప్పుతున్నారు. ఇందుకోసం ఓ ఇంజనీర్‌ను బుట్టలో వేసుకున్నట్టు తెలుస్తోంది. సదరు ఇంజనీర్ కూడా యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టును ఆశిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న సదరు మాయా 'గోపాలుడు' ఆ పోస్టు ఇప్పిస్తానంటూ చెబుతున్నట్టు సమాచారం. ఇందుకోసం యూనివర్సిటీలోని ఒక అధికారి ద్వారా సిఫార్సు కూడా చేయిస్తున్నట్టు తెలుస్తోంది. సదరు అధికారికి కూడా చినబాబు పేరుతో మస్కా కొట్టినట్టు యూనివర్సిటీలో చర్చ నడుస్తోంది. 'మీ గురించి చినబాబుకు మంచిగా చెబుతానంటూ సదరు అధికారికి వల వేశారు'.. ఇందులో భాగంగా సదరు అధికారి కూడా సదరు చోటా నేత సిఫార్సు చేసిన ఇంజనీర్‌కే యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు ఇవ్వాలంటూ అర్హత లేకపోయినప్పటికీ ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం రికార్డులను కూడా ఏమారుస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు కోసం..!

యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు ఆశిస్తున్న ఓ ఇంజనీర్.. సదరు చోటా నేతకు 'ప్రణ'మిల్లి మరీ అర్హత లేకపోయినా నామినేషన్ పద్ధతిలో పనులను అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు పనులను నామినేషన్‌పై అప్పగించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా తాను యూనివర్సిటీ ఇంజనీర్‌గా పూర్తి స్థాయిలో నియమితులైతే... యూనివర్సిటీలో చేపట్టే పనుల్లో మెజార్టీ వాటా వీరికే వచ్చేలా చేస్తానని కూడా హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం నియమించిన కమిటీ సభ్యులకు కూడా సదరు వ్యక్తికే యూనివర్సిటీ ఇంజనీరు పోస్టు వచ్చేలా చూడాలంటూ వర్సిటీలోని ఓ అధికారి అనధికారికంగా సమాచారం ఇచ్చినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నారు. చినబాబుకు చెప్పి.. తన పోస్టుకు ఎసరు రాకుండా చూస్తారనే ఆశతో యూనివర్సిటీ అధికారి కూడా సదరు చోటా నేత చెప్పినట్టు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 134 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 29,927 మంది విద్యార్థులు



మధురానగర్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు **ఉదయం 9.30 గంటల** నుంచి మధ్యాహ్నం 12.45 **వరకు పరీక్షలు** జరుగుతాయన్నారు. జిల్లాలో **29,927 మంది విద్యార్థు**లు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. **వీరిలో** 26,523 మంది రెగ్యులర్‌గా, **1,404 మంది** ప్రైవేట్‌గా, 2,124 మంది **ఒకేషనల్ ట్రేడ్ పరీక్షలు** రాయనున్నారని **పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో** 15,094 మంది **బాలురు, 13,429 మంది** బాలికలు ఉన్నారన్నారు. **285 మంది దివ్యాంగ విద్యార్థుల సౌలభ్యం కోసం గ్రౌండ్ ఫ్లోర్లో పరీక్షలు నిర్వహించేలా** ఏర్పాట్లు చేశా**మన్నారు. పరీక్షల నిర్వహణకు** 134 కేంద్రాలు **ఏర్పాటు చేశామని, ఇందు**లో 48 ఏ కేటగిరీ కేంద్రాలు, 71 బీ కేటగిరీ కేంద్రాలు, 9 సీ కేటగిరీ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో ముందస్తుగా గుర్తించిన 6 సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 134 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 134 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 1,472 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్ ఆధారంగా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు.

ఆఫ్‌లైన్‌లో టికెట్లు లేనట్టేనా?

- 24న లక్నో సూపర్ జెయింట్స్‌తో డీసీ ఢీ
- ఆన్‌లైన్‌లోనే టికెట్ల విక్రయాలు



విశాఖ స్పోర్ట్స్: వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆడనున్న తొలి ఐపీఎల్ మ్యాచ్‌కు ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయం లేనట్టేనా? ఇటీవల ఏసీఏ నిర్వహించిన సమావేశంలో ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్లు విక్రయిస్తామని ప్రకటించినప్పటికీ, అందుకు తగ్గట్టుగా ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) బృందం ఏర్పాట్లు చేయకపోవడంతో కౌంటర్ల ద్వారా టికెట్ల విక్రయం లేదని తెలిసింది. ఈ నెల 24న లక్నో సూపర్ జెయింట్స్‌తో డీసీ తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం ఈ నెల 13వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ఆన్‌లైన్‌లో డీసీ టికెట్లను విక్రయించడం ప్రారంభించింది. ప్రస్తుతం తక్కువ ధరల్లో టికెట్లు అందుబాటులో లేవు.రూ.2,200, రూ.2,500,రూ.3,000, రూ.3,500, అత్యధికంగా రూ.5,000 విలువ గల టికెట్ల ఖాళీలే కనిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారు వాటిని ఫిజికల్ టికెట్లుగా మార్చుకోవడానికి మున్సిపల్ స్టేడియం, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్ వద్ద కౌంటర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. మ్యాచ్ ప్రారంభానికి మూడు గంటల ముందు వరకు టికెట్లు మార్చుకునే అవకాశం ఉంది.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ఐపీఎల్ నేపథ్యంలో వైఎస్సార్ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను శనివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. ఆటగాళ్లు విశ్రాంతి తీసుకునే హోటల్‌తో పాటు స్టేడియంలోని ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు తగిన సూచనలు చేశారు. ఇరుజట్లకు సీజన్‌లో ఇదే తొలి మ్యాచ్ కావడంతో నెట్ ప్రాక్టీస్ చేసుకునే బీ గ్రౌండ్‌లోనూ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్

సాక్షి, విశాఖపట్నం: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) 56వ దినోత్సవం సందర్భంగా 'సురక్షిత తీరాలు, సమృద్ధి భారత దేశం' అనే థీమ్‌తో దేశవ్యాప్త సైక్లోథాన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నెల 7న తమిళనాడులోని అరక్కోణంలో ప్రారంభమైన ఈ సైక్లోథాన్ ఈ నెల 17న నగరానికి చేరుకోనుంది. సైకిల్ ర్యాలీతో వచ్చే సీఐఎస్ఎఫ్ బృందానికి సంప్రదాయ స్వాగతం పలికేందుకు విశాఖ పోర్ట్ అథారిటీ బీచ్ రోడ్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ర్యాలీని కొనసాగించేదుకు వీలుగా 18న ప్రత్యేక సెండాఫ్ కోసం నిర్వహిస్తున్న ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోర్టు చైర్మన్ డా.అంగముత్తు పాల్గొననున్నారు. స్థానిక ప్రజలను చైతన్య పరిచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోర్టు అధికారులు తెలిపారు. తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రత పట్ల అవగాహన కల్పించడం, ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు వంటి ముప్పులపై వారికి సూచనలు ఇవ్వడం ఈ సైక్లోథాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ భూతం.. అడ్డుకట్టతో ఆరోగ్యం





స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, ర్యాలీలో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్

ఏయూక్యాంపస్: ప్రజల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలను చూపే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని మేయర్ జి.హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ వంటి వ్యాధులు రావడానికి ప్లాస్టిక్ ప్రధాన కారణంగా నిలుస్తోందని, ఇటువంటి వాటికి పూర్తిగా స్వస్తి పలకాలని కోరారు. ప్లాస్టిక్ సంచుల్లో వేడి ఆహారం ప్యాకింగ్ చేయడం, వాటిని తినడం ప్రమాదకరమన్నారు. కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక ప్రత్యేక నినాదంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 1 నుంచి ప్లాస్టిక్ వస్తువుల క్రయ విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, దాడులు నిర్వహించి అమ్మే వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అనంతరం ర్యాలీని జిల్లా ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్ ప్రారంభించారు. వంద అడుగుల వస్త్రంతో చేసిన బ్యానర్ పట్టుకుని మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వస్త్రంతో చేసిన సంచులను పంపిణీ చేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు సోమన్నారాయణ, వర్మ, రమణ, మూర్తి, సీఎంవో నరేష్, వివిధ జోనల్ కమిషనర్లు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మీరు అగ్నివీర్ అవుతారా?

అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ

- 13 భాషల్లో ప్రవేశ పరీక్ష
- ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు బోనస్ మార్కులు
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం



సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనుకునే యువతకు శుభవార్త. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రిక్రూట్‌మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రవేశ పరీక్షను ఏకంగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మరోవైపు రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశాఖపట్నం మరోసారి వేదిక కానుంది. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఇటీవలే విడుదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా, మచిలీపట్నం జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపికలు నిర్వహించాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఏప్రిల్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కేటగిరీల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి, జనరల్ డ్యూటీ కేటగిరీలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారు. అలాగే 17 1/2 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే ఈ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాది కీలక మార్పులు

ఈ సారి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో పలు ముఖ్యమైన మార్పులు చేశారు. గతంలో అభ్యర్థులు ఒక కేటగిరీకి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో వంటి అదనపు విద్యార్హతలు కలిగిన వారికి బోనస్ మార్కులు లభిస్తాయి. గతంలో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను ఇప్పుడు తెలుగుతో సహా 13 భాషల్లో రాసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అడ్మిట్ కార్డులో ర్యాలీకి హాజరుకావాల్సిన తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయి. అభ్యర్థుల సౌకర్యం కోసం రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశంలో ప్రత్యేక రిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో పారదర్శకంగా జరుగుతుందని రక్షణ శాఖ తెలిపింది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం లైవ్ చాట్ సదుపాయంతో పాటు 'ఆర్మీ కాలింగ్' అనే ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సమాచారం కోసం www.joinindianarmy. nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని 0891-2756959, 0891-2754680 నంబర్లలో సంప్రదించవచ్చు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తరిమేద్దాం



జ్యూట్ బ్యాగులను ప్రదర్శిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు

మేయర్ హరివెంకటకుమారి పిలుపు

తాటిచెట్లపాలెం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నగరం నుంచి తరిమివేయాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తదితరులతో కలిసి ఆమె స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసి.. నగర పరిశుభ్రతకు పాటుపడాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను వాడి క్యాన్సర్ బారిన పడొద్దని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్లే కలిగే నష్టాలను డోర్ టూ డోర్ క్యాంపెయిన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్ర లేదా నార సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ఆర్.సోమనారాయణ, కార్పొరేటర్లు ఉషశ్రీ, రాజశేఖర్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

నాందేడ్, ఎల్టీటీ, షిర్డీ రైళ్ల రూట్ మార్పు

- సికింద్రాబాద్‌కు రాకపోకలు బంద్
- కొత్తగా చర్లపల్లిలో హాల్ట్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్లను సికింద్రాబాద్ మీదుగా కాకుండా.. చర్లపల్లి మీదుగా నడిచే విధంగా మార్పులు చేశారు. ఈ మార్పులు శాశ్వతంగా వర్తిస్తాయని వాల్తేర్ డివిజన్ అధికారులు స్పష్టం చేశారు. కింద పేర్కొన్న రైళ్లకు కొత్తగా చర్లపల్లిలో హాల్ట్ ఇచ్చారని తెలిపారు.

- విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 20 నుంచి, లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం (18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 22 నుంచి మార్పు చేసిన మార్గంలో అంటే వయా చర్లపల్లి, అమ్ముగూడ, సనత్‌నగర్ మీదుగా నడుస్తాయి. ఆ రోజు నుంచి ఈ రైళ్లు మౌలాలి, సికింద్రాబాద్ స్టేషన్ల మీదుగా ప్రయాణించవు.
- సంబల్‌పూర్–నాందేడ్ (20809) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి, నాందేడ్–సంబల్‌పూర్ (20810) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి మార్పు చేసిన మార్గంలో వయా చర్లపల్లి–మౌలాలి జీ క్యాబిన్–దయానందనగర్ మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లు ఆయా తేదీల నుంచి సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా ప్రయాణించవు.
- విశాఖపట్నం–నాందేడ్ (20811) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి, నాందేడ్–విశాఖపట్నం (20812) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 27 నుంచి వయా చర్లపల్లి–మౌలాలి జీ క్యాబిన్–దయానందనగర్ మీదుగా నడుస్తాయి. ఆయా తేదీల నుంచి ఈ రైళ్లు సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా ప్రయాణించవు.
- విశాఖపట్నం–సాయినగర్ షిర్డీ (18503) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24 నుంచి, సాయినగర్ షిర్డీ–విశాఖపట్నం (18504) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి వయా చర్లపల్లి–మౌలాలి జీ క్యాబిన్–దయానందనగర్ మీదుగా నడుస్తాయి. ఆయా తేదీల నుంచి ఈ రైళ్లు సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా ప్రయాణించవు.

జూ పార్కులో రాప్టర్ల ప్రదర్శన ప్రారంభం



రాప్టర్స్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న జూ ఎడ్యుకేషన్ సిబ్బంది

ఆరిలోవ: పర్యావరణ పరిరక్షణలో రాప్టర్ల(గెద్ద జాతి) పాత్ర ఎంతో కీలకమని చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ శాంతిప్రియ అన్నారు. ఇందిరాగాంధీ జూ పార్కులో డబ్ల్యూడబ్ల్యూఎఫ్–ఇండియా వింగ్ ఆఫ్ వండర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రాప్టర్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతి ప్రియ మాట్లాడుతూ రాప్టర్లు మాంసాహార పక్షులని, ఇవి ఎలుకలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. అంతేకాకుండా, చనిపోయిన జంతువుల కళేబరాలను తొలగించడం ద్వారా పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచుతాయని వివరించారు. విద్యార్థులు రాప్టర్ల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. 90 రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో రాప్టర్ల చిత్రపటాలు, వాటికి సంబంధించిన సమాచార బోర్డులు ఏర్పాటు చేశారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాల నాయుడు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్–ఇండియా వింగ్ ఆఫ్ వండర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

18న టైమ్ బీవోఐ ప్రత్యేక సెమినార్

మహారాణిపేట: సమయం విలువను, ప్రాముఖ్యతను తెలుపుతూ టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్యక్రమాల అమలుకు విశాఖ పైలట్ జిల్లాగా ఎంపికైందని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ పి.సి.జైన్ తమ కార్యక్రమాలను అమలు చేయడానికి జిల్లాను ఎంపిక చేశారని, ఈ మేరకు ఈ నెల 18వ తేదీన జిల్లా పరిషత్ సమీపంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నామని వెల్లడించారు.





• కళ్లెం వేయకపోతే.. కడుపు కోతే..

నగరంలో మైనర్లు ద్విచక్ర వాహనాలపై రెచ్చిపోతున్నారు. లైసెన్స్ లేకుండానే బైక్‌లు నడుపుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్లు ధరించకుండా, ట్రిపుల్, జిగ్‌జాగ్ డ్రైవింగ్‌తో ఇతర వాహనచోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. వారికి సరైన డ్రైవింగ్ నైపుణ్యాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండదు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వంటివి కూడా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తాయి. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వారి ప్రాణాలకే కాకుండా.. ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి మైనర్లకు బైక్‌లు ఇవ్వకుండా చూడాలి.

\- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



నాగుపాము కలకలం



పామును పట్టుకున్న కిరణ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–11లో 111 క్వార్టర్స్‌లో నాగుపాము హల్‌చల్ చేసింది. స్టీల్‌ప్లాంట్ అధికారి లింగాల రవీంద్రబాబు ఇంటి ఆవరణలో సుమారు 7 అడుగుల పాము కనిపించింది. దీంతో క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్ కుమార్ సమాచారం అందించడంతో ఆయన అక్కడకు చేరుకొని నాగుపామును చాకచక్యంగా పట్టుకున్నాడు.

ఘనంగా సిటిజన్ ఫోర్స్ పురస్కారాల ప్రదానం



పురస్కారం అందిస్తున్న సీనియర్ సినీ నటులు సుమన్, భానుచందర్

బీచ్‌రోడ్డు: సాంకేతిక, సామాజిక, సేవా, సినీ, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన 20 మందికి ఎఫ్‌టీపీసీ, సిటిజన్ ఫోర్స్ సంయుక్తంగా జాతీయ పురస్కారాలు ప్రదానం చేశాయి. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. బాలీవుడ్ నటి నైనా గంగూలీ, సీనియర్ సినీ నటులు సుమన్, భానుచందర్, ముంతాజ్ సర్కార్‌లు పురస్కార గ్రహీతలను సన్మానించారు.

నేల నుంచి నీటిలోకి..

సముద్రంలోకి ఆలీవ్ రిడ్లే తాబేలు పిల్లలు



తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెడుతున్న డీఎఫ్‌వో శ్రీవాణి

కొమ్మాది: బుల్లి ఆలివ్ రిడ్లే తాబేళ్లు బుడిబుడి అడుగులు వేసుకుంటూ తమ సహజ ఆవాసమైన సముద్రంలోకి చేరుకున్నాయి. ఈ మనోహరమైన దృశ్యం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది. జోడుగుళ్లపాలెం, చేపలుప్పాడ, పెదనాగమయపాలెం ప్రాంతాల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెట్టిన గుడ్లను అటవీ శాఖ అధికారులు సేకరించి సాగర్‌నగర్‌లోని తాబేళ్ల సంరక్షణ కేంద్రంలో సంరక్షించారు. వీటి నుంచి వచ్చిన పిల్లలను డీఎఫ్‌వో శ్రీవాణి శనివారం సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోడుగుళ్లపాలెం నుంచి పెదనాగమయపాలెం వరకు మొత్తం 57,372 గుడ్లను సేకరించి సంరక్షించినట్లు తెలిపారు. తొలి దశలో శనివారం ఉదయం 237 తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లోనూ విడతల వారీగా మరిన్ని తాబేలు పిల్లలను సముద్రంలోకి విడుదల చేస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగం



అనంత పద్మనాభ స్వామిని ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు చేయిస్తున్న వేద పండితులు

ముగిసిన అనంతుని కల్యాణోత్సాలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలు శనివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులైన శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి.. కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు చేయించారు. తర్వాత కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వేదిక పైకి అధిష్టింపజేసి.. శ్రీ పుష్పయాగం విశేషంగా నిర్వహించారు. స్వామికి పలు రకాల పుష్పాలను నివేదించారు. కార్యక్రమంలో పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వీఎంఆర్డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడు, మొకర సన్నిబాబు, మహిళలు పాల్గొన్నారు.

ఉంగరం ఏమైంది?

స్వామి వినోదోత్సవం నేత్రపర్వంగా సాగింది. ముందుగా స్వామి శుక్రవారం గ్రామంలోకి వెళ్లారు. ఆ సమయంలో స్వామికి తిరుమంగయాళ్వార్ ఎదురుపడతారు. ఆలయంలోకి వచ్చిన తర్వాత స్వామి ఉంగరం కనిపించ లేదు. దీంతో స్వామి శనివారం ఉదయం ఉంగరం వెతకడానికి ఆలయం నుంచి గ్రామంలోకి వెళ్లారు. అనుమానం వచ్చిన వారందరినీ ఉంగరం తీశారంటూ తాళ్లతో బంధించారు. తాము తీయలేదని చెప్పడంతో తిరుమంగయాళ్వార్‌పై అనుమానం వచ్చి అతన్ని అడిగారు. తాను తీయలేదని తేల్చి చెప్పారు. చివరకు అనంత పద్మనాభ స్వామి వస్త్రాల్లోనే ఉంగరం దొరుకుతుంది. ఈ వేడుకను అర్చకులు కడురమ్యంగా నిర్వహించారు.

గాజువాకలో దారుణం

- పదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం
- కామాంధుడిని పట్టుకున్న స్థానికులు



దాడి భాను(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: పదేళ్ల బాలికపై 45 ఏళ్ల కామాంధుడు లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమై.. నిందితుడిని పట్టుకుని గాజువాక పోలీసులకు అప్పగించారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎ.పార్థసారథి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలివి.. గాజువాక డ్రైవర్స్ కాలనీలో కూరగాయలు అమ్ముకుంటూ దాడి భాను ఒంటరిగా నివసిస్తున్నాడు. అతని ఎదురింట్లో పదేళ్ల బాలికతో కలిసి ఒక కుటుంబం నివాసం ఉంటోంది. శనివారం బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయం చూసి భాను ప్రవేశించాడు. బాలికను సుత్తి కావాలని అడిగి ఆమెపై లైంగికదాడికి యత్నించాడు. దీంతో బాలిక పెద్దగా కేకలు వేయడంతో.. స్థానికులు ఆ ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇది గమనించి పారిపోతున్న భానును పట్టుకుని గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని భానును అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

ఎంవీపీకాలనీ: తల్లి మందలించిదని బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎంవీపీ సీఐ మురళీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలూరి రమాదేవి, సురేష్ దంపతులకు ఇద్దరు పిల్లలు. వీరు ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని నక్కవానిపాలెంలో నివసిస్తున్నారు. కుమార్తె సాయి తనూష (16) చంద్రపాలెం జెడ్పీ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఆమె ఓ బాలుడితో గత కొంతకాలంగా ఫోన్‌లో తరచూ మాట్లాడుతుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తనూషను తల్లి మందలించింది. దీంతో కోపంతో తనూష గదిలోకి గెడపెట్టుకుంది. కొద్దిసేపటి తరువాత అనుమానం వచ్చి తల్లి తలుపులు కొట్టిన తీయలేదు. పక్కంటి వారి సహకారంతో తలుపులు పగలుగొట్టి చూడగా తనూష ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సవతి తండ్రి లైంగిక వేధింపులు?

మద్రిపాలెం: ఇంటర్ చదువుతున్న కుమార్తెను సవతి తండ్రి లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఘటన కంచరపాలెంలో వెలుగులోకి వచ్చింది. కంచరపాలెం తిక్కవానిపాలెంలో ఓ మహిళ తన కుమార్తె, రెండో భర్తతో కలిసి నివాసముంటున్నారు. సవతి తండ్రి కుమార్తెకు ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూపిస్తూ లైంగికంగా వేధిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఆమె పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. అయితే పోలీసులు మాత్రం తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మన్యంలో చిన్నారుల మృత్యు ఘోష

- అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది గైర్హాజరుపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం
- నోటీసులు జారీ చేయాలని సీఈవోకు ఆదేశం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలైనా కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంపై సభ్యుల ఆగ్రహం
- వాడీవేడిగా జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు



హాజరైన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ, ఇతర సభ్యులు

మహారాణిపేట: కీలకమైన జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన పలు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఏజెన్సీలో వైద్య సదుపాయాలపై, పిల్లల మరణాలపై చర్చ జరిగింది. కానీ సమాధానం చెప్పడానికి అధికారులే లేరు. దీంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు నోటీసులు జారీ చేయాలని చైర్‌పర్సన్ సీఈవోను ఆదేశించారు. తొలుత అరకు జెడ్పీటీసీ చెట్టి రోష్ని మాట్లాడుతూ అరకు మండలం బస్కి గ్రామంలో పిల్లలు ఆకస్మికంగా మృతి చెందారని, ఈ విషయం గురించి మాట్లాడడానికి తాను హెల్త్ సబ్ సెంటర్‌కు కాల్ చేసినా ఎవరూ ఫోన్ ఎత్తడం లేదన్నారు. పలు వైద్య ఆరోగ్యశాఖ సబ్ సెంటర్లకు వైద్యులు రావడం లేదని, వారిని అడిగే నాథులే లేరని ఆమె వాపోయారు. గిన్నెల, మాడగూడ తదితర ప్రాంతాల్లో చిన్న పిల్లలు వరుసగా చనిపోయారని, కారణం తెలియక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరణ ఇవ్వాలని చైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఒక్క అధికారి కూడా రాలేదని, జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలకు రాని అధికారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆమె సీఈవోను ఆదేశించారు. గిరిజన ప్రజలను మన్యం నుంచి కేజీహెచ్‌కు తరలించడానికి 108 అంబులెన్సు అవసరం ఉంటుందని, కానీ ఫోన్ చేసినా 108 అంబులెన్సులు రావడం లేదని చైరపర్సన్ అన్నారు.

పింఛన్ల మీద వివక్ష : కొత్తగా పింఛన్లు మంజూరు కాకపోవడంపై పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పింఛన్లు తీసుకుంటూ చనిపోయిన వారి కుటుంబ సభ్యుల్లో అర్హులుంటే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారని, దరఖాస్తు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారన్నారు. అలాగే అర్హులకు పింఛన్లు ఇస్తామని చెప్పారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నా ఎక్కడా కొత్త పింఛన్లు ఇవ్వలేదని, ఇది అన్యాయమన్నారు.

జెడ్పీటీసీ సభ్యులను పట్టించుకోని హౌసింగ్ అధికారులు

హౌసింగ్ అధికారులు జెడ్పీటీసీలు, మండల అధ్యక్షులను పట్టించుకోవడం లేదని పలువురు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. తమ మండలాల్లో గృహ నిర్మాణ అధికారులు సర్వే చేస్తున్న సమయంలో, కొత్త పేర్ల నమోదు చేసేటప్పుడు తమను సంప్రదించడం లేదని, దీనివల్ల స్థానికంగా తాము ఇబ్బంది పడుతున్నామని, గతంలో ఎప్పుడూ ఇలా లేదని వారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు.

పోస్టుమార్టంలో జాప్యం

కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహణలో జాప్యంపై చైర్‌పర్సన్‌తోపాటు పలువురు జెడ్పీటీసీలు ప్రశ్నించారు. మార్చురీ వద్ద అనధికారికంగా డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎక్కువగా గిరిజన ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఎందుకు జాప్యం జరుగుతోందని చైర్‌పర్సన్ సుభద్ర ప్రశ్నించారు. దీనికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ బదులిస్తూ.. రోడ్డు ప్రమాదాల్లో మృతులకు పోస్టుమార్టం జరిగే ముందు పోలీసులు శవ పంచనామా నిర్వహించాలని, ఇందులో జాప్యం జరిగితే అన్నీ ఆలస్యం అవుతాయన్నారు. పాయరావుపేట నుంచి అనకాపల్లి వరకు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, అందువల్ల అనకాపల్లిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సోమ సత్యనారాయణ కోరారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తితోపాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లిహూరి స్టేషన్‌లో పలు రైళ్లకు తాత్కాలిక హాల్ట్

తాటిచెట్లపాలెం: డోలో యాత్ర పండుగల సందర్భంగా నౌపడ–గుణుపూర్ లైన్‌లో ప్రయాణించే అన్ని రైళ్లకు శనివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు లిహూరి స్టేషన్‌లో రెండు నిమిషాల తాత్కాలిక హాల్ట్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.